సాక్షి
నిజామాబాద్
మంగళవారం ၊ 20 ၊ ఫిబ్రవరి ၊ 2024



వినతులను పరిష్కరించాలి
ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు.
- 8లో ▸



ప్రజాదరణ చూసి ఓర్వలేకే..
ఎంపీ అర్వింద్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని కులాచారి దినేష్ ఆరోపించారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.1 /20.3

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగవచ్చు. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు 'కేవీ' భవనాన్ని ప్రారంభించనున్న ప్రధాని



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో నిర్మించిన కేంద్రీయ విద్యాలయం నూతన భవనాన్ని మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యా యి. కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి కేంద్రం రూ. 22కోట్లు మంజూరు చేయగా రాష్ట్ర ప్రభుత్వం నగర శివారులోని రఘునాథ చెరువు సమీపంలో ఏడు ఎకరాల స్థలం కేటాయించింది. 2019 అక్టోబర్‌లో నిర్మాణానికి భూమిపూజ చేశారు. దాదాపుగా నాలుగేళ్ల తర్వాత నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రారంభోత్సవ కార్యక్రమం ఉదయం 11 గంటలకు మొదలవనుంది. కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఎంపీ ధర్మపురి అర్వింద్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొననున్నారు.

జెడ్పీ సీఈవోగా ఉష బాధ్యతల స్వీకరణ



నిజామాబాద్ రూరల్: జిల్లా పరిషత్ సీఈవోగా ఉష సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మొన్నటి వరకు ఇక్కడ పనిచేసిన సీఈవో గోవింద్ ఇటీవల బదిలీపై వెళ్లగా.. ఉష నాగర్ కర్నూల్ నుంచి జిల్లాకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన సీఈవోకు బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

నిజాంషుగర్స్ పునరుద్ధరణ కమిటీ రాక వాయిదా

బోధన్: నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్(ఎన్డీఎస్ఎల్) పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ప్రతినిధుల బృందం రాక వాయిదా పడింది. బోధన్, ముత్యంపేట (జగిత్యాల), ముంబోజిపల్లి (మెదక్) ఎన్డీఎస్ఎల్ యూనిట్లను తెరిపించేందుకు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు చైర్మన్‌గా, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా కో–చైర్మన్‌గా, బోధన్, మెదక్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలతో పాటు మరో నలుగురు ఉన్నతాధికారులను సభ్యులుగా కమిటీని వేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ మంగళవారం బోధన్ ఫ్యాక్టరీ సందర్శనకు రావాల్సి ఉంది. ఇందుకోసం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఏర్పాటు సైతం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు ప్రభుత్వ కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో కార్యక్రమం వాయిదా పడింది. కమిటీ రాక మళ్లీ ఎప్పుడు ఉంటుందనే విషయంలో స్పష్టతలేదు.

మేడారం జాతరకు ప్రత్యేక రైళ్లు

సుభాష్‌నగర్/ఖలీల్‌వాడి: మేడారం సమ్మక్క – సారలమ్మ జాతర కోసం జిల్లా నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, సౌత్ రైల్వే అధికారి సురేష్‌రెడ్డి సోమవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఇందూరు నుంచి ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక రైళ్లు నడుస్తాయని, భక్తులు వినియోగించుకోవాలని కోరారు. అలాగే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో సమ్మక్క – సారలమ్మ జాతరకు కేంద్ర ప్రభుత్వం రూ. 3 కోట్ల నిధులు విడుదల చేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి



నిజామాబాద్ రూరల్: ఎంపీడీవోలు 2024–25 సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు సూచించారు. జెడ్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఇటీవల బదిలీపై వచ్చిన 20 మండలాల ఎంపీడీవోలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి ఈ–గ్రామ స్వరాజ్ పనులను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. మండలాల్లో చేపట్టే కార్యక్రమాలపై సమగ్ర నివేదికను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.



ఎడపల్లిలో శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అర్వింద్ తదితరులు



ఎడపల్లిలో ఆవిష్కరించిన ఛత్రపతి శివాజీ విగ్రహం

జై భవాని.. వీర శివాజీ..

ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని సోమవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఎడపల్లిలో శివాజీ విగ్రహాన్ని ఎంపీ అర్వింద్ ఆవిష్కరించారు. రానున్న ఎంపీ ఎన్నికలు ఔరంగజేబు, ఛత్రపతి శివాజీ మధ్య జరుగనున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేత మేడపాటి ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

భానుడి భగభగ..

- నిజామాబాద్ నార్త్ మండలంలో అత్యధికంగా 38.7 డిగ్రీలు
- పగలు సూర్య తాపం.. రాత్రి చలి తీవ్రత

సుభాష్‌నగర్: జిల్లాలో భానుడి భగభగ మండుతున్నాడు. సోమవారం నిజామాబాద్ నార్త్ మండలంలో పగటి ఉష్ణోగ్రత 38.7 డిగ్రీలుగా నమోదైంది. కాగా సగటు ఉష్ణోగ్రతలు 37.1, 20.3 డిగ్రీలుగా నమోదయ్యాయి. ఫిబ్రవరి రెండోవారం నుంచే ఎండలు భగ్గుమంటున్నాయి. జిల్లాలోని డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లిలో 38.4 డిగ్రీలు, భీమ్‌గల్‌లో 38.2, మెండోరాలో 37.8, సిరికొండ, మోర్తాడ్‌లో 37.5, నిజామాబాద్ సౌత్‌లో 37.4, మంచిప్ప, మోస్రా 37.3, జక్రాన్‌పల్లిలో 37.0, ఏర్గట్ల, ధర్పల్లి, బోధన్‌లోని కల్దుర్కి, వర్నిలో జాకోరా, తదితర మండలాల్లో 36 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా మండలాల్లోనూ ఉష్ణోగ్రతలు గతేడాది కంటే ఎక్కువగా ఉన్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా, రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. వేకువజామున స్వల్పంగా మంచు పడుతూ చల్లని గాలులు వీస్తున్నాయి. శివరాత్రి సమీపిస్తుండడంతో చలి తీవ్రత పెరిగే అవకాశముంది. ఆ తర్వాత ఎండలు, వడగాలులు, ఉక్కపోత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



నగరంలో అనుమతులు లేకుండానే ఏర్పాటు చేసిన వెంచర్

అధికారం మనదే..
అడ్డేముంది!

అధికారం ఉంటే చాలు నిబంధనలతో పనిలేదన్నట్లు వ్యవహరిస్తున్నారు కొందరు నాయకులు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు కొందరు ప్రభుత్వ భూములను ఇష్టారీతిన ఆక్రమించి ప్లాట్లు చేసి అమ్ముకున్నారు. బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడంతో ఆ పార్టీ నాయకుల దందాకు బ్రేక్ పడింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు కొందరు అదేరీతిన రెచ్చిపోతున్నారు. అనుమతులు లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేసి ప్లాట్ల అమ్మకాలు సాగిస్తున్నారు.

- కబ్జాచేసేయ్.. వెంచర్ వేసేయ్
- అనుమతులు లేకుండానే వెంచర్లు వేసి ప్లాట్లు అమ్ముతున్న కాంగ్రెస్ నేత
- చోద్యంచూస్తున్న మున్సిపల్ అధికారులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ నగరంలోని బోధన్ రోడ్డులో మత్స్యశాఖ కార్యాలయం సమీపంలోని వీధి వద్ద ఎన్‌ఆర్‌ఐ కాలనీలో ఒక కాంగ్రెస్ నాయకుడు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే గేటెడ్ కమ్యూనిటీ పేరిట వెంచర్ వేసి ప్లాట్లు అమ్ముతున్నాడు. లేఅవుట్ పర్మిషన్లు, డీటీపీపీ అప్రూవల్స్ లేకుండానే వెంచర్ వేసి ప్లాట్లు చేసి గజం రూ.30 వేల చొప్పున అమ్మకాలు చేస్తున్నాడు. 4.5 ఎకరాల్లో రెండు వెంచర్లు వేసి వీటిల్లో ప్లాట్లు అమ్ముతున్నాడు. ఇంత జరుగుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం. అదేవిధంగా ఇందులో కొనుగోలు చేస్తున్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు ఏవిధంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారో అని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ టీపీఎస్ ప్రవీణ్‌ను వివరణ కోరగా సదరు వెంచర్‌కు అనుమతులు లేవన్నారు. మున్సిపల్ కమిషనర్ మకరంద్‌ను వివరణ కోరగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పార్కు, ఆట స్థలాలు లేనేలేవు..

మైనారిటీలు ఎక్కువగా ఉండే ఎన్‌ఆర్‌ఐ కాలనీ ప్రాంతంలో ఇప్పటివరకు ఒక్క పార్కు, ఆటస్థలం, ఓపెన్ జిమ్ లాంటివి ఏర్పాటు చేయలేదు. ఉన్న భూములన్నీ కబ్జాలకు గురి కావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తున్న ఇలాంటి వారిని చూసి మరికొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూములను కబ్జా చేసి అమ్ముకుంటున్నారు. దీంతో ఈ ప్రాంతంలో పార్కు, క్రీడా ప్రాంగణం, జిమ్ ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా ఇక్కడ గతంలోనూ, ఇప్పుడు కూడా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం నాయకులు కలిసి చేసిన కబ్జాలు అనేకం ఉన్నాయి.

ప్రస్తుత మేయర్, డిప్యూటీ మేయర్ అనుచరులు సైతం నగరంలో అనేక చోట్ల భూదందాలు, ఆక్రమణలు విచ్చలవిడిగా చేసినట్లు అనేక ఫిర్యాదులు ఉన్నాయి. భారీగా భూఆక్రమణల ఆరోపణలు ఉన్న మేయర్ బీఆర్‌ఎస్ నుంచి అధికార పార్టీ కాంగ్రెస్‌లోకి ఫిరాయించేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఓటరు జాబితాలో తప్పులుండొద్దు

- పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

సుభాష్‌నగర్: ఓటరు జాబితాలో తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా పరిశీలించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. జాబితాలో మార్పులు – చేర్పులు, పేర్ల తొలగింపులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా సోమ వారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో సీఈవో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను రోజువారీగా పరిశీలిస్తూ, వెంటనే పరిష్కరించేలా పర్యవేక్షించాలని కలెక్టర్లకు సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, వారికి శిక్షణ తరగతులు, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎంసీఎంసీ కమిటీ ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్ కోసం అవసరమైన బ్యాలెట్ పత్రాల ముద్రణ తదితర వాటిని చక్కబెట్టుకోవాలని సీఈఓ సూచించారు.

వీసీ అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఈఆర్‌వోలతో సమీక్షించారు. ఓటరు జాబితా పక్కాగా రూపొందేలా అన్ని స్థాయిల్లో పకడ్బందీగా పరిశీలించాలని ఆదేశించారు. 2024 ఏప్రిల్ 01 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న వారి నుంచి సైతం దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని గుర్తించే క్రమంలో అదనపు సిబ్బంది సైతం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు–చేర్పులు, తొలగింపులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల పరిశీలనను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, కార్పొరేషన్ కమిషనర్ మకరంద్, ఎన్నికల నోడల్ అధికారి సురేష్ కుమార్, ఆర్డీవోలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్, వినోద్ కుమార్, భుజంగరావు, సహాయ ఈఆర్‌వోలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్ పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

హైకోర్టు తీర్పు అమలు చేస్తాం

- 'అవిశ్వాస తీర్మానం'పై ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు వెనక్కి తీసుకుంటాం
- హైకోర్టులో నివేదించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్
- చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించిన న్యాయమూర్తి

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అవిశ్వాస తీర్మానం వ్యవహారం హైకోర్టు జోక్యంతో కొలిక్కి వస్తోంది. సోమవారం హైకోర్టు న్యాయమూర్తి చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు కూడా చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహించడానికి న్యాయమూర్తి ఎదుట సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అధికారులు అవిశ్వాస తీర్మానం సమావేశం నిర్వహించినా.. స్పష్టత ఇవ్వకపోవడంతో కారణంగా సమస్య హైకోర్టుకు చేరింది. ఈ నెల 10న హైకోర్టు న్యాయమూర్తి రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ నెల 19లోగా చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహించాలని ఆదేశించారు. అయినా ఎన్నిక నిర్వహణలో ఆలస్యం జరుగుతుండడంతో సోమవారం కేసు మళ్లీ న్యాయమూర్తి ముందుకెళ్లింది.

స్పష్టమైన ఆదేశాలిచ్చినా ఎన్నిక నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్ కోర్టుకు తెలిపారు. కోర్టు సూచనలు పాటిస్తూ ఎన్నిక నిర్వహిస్తామని అంగీకరించడంతో న్యాయమూర్తి ఎన్నికల కమిషన్ అధికారులకు సైతం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. మరోవైపు వైస్‌చైర్మన్‌కు చైర్మన్‌గా అదనపు బాధ్యతలు ఇవ్వాలని వైస్‌చైర్మన్ మున్ను వేసిన కేసు సైతం హియరింగ్‌కి రావడంతో ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కాగానే అదనపు బాధ్యతలు ఇస్తారని న్యాయమూర్తి సూచించారు. దీంతో వినీత వర్గీయులకు చుక్కెదురైనట్లయ్యింది.

ఎస్సైల బదిలీలకు రంగం సిద్ధం!

- ఐజీ వద్ద జాబితా
- ఇప్పటికే సీఐలు, ఏసీపీలు, డీసీపీలకు స్థానచలనం



ఖలీల్‌వాడి: జిల్లాలో సీఐలు, ఏసీపీలు, డీసీపీల బదిలీలు పూర్తికాగా తాజాగా ఎస్సైల స్థానచలనంపై చర్చ జరుగుతోంది. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 39 పోలీస్‌స్టేషన్ల పరిధిలో గల ఎస్సైలకు సంబంధించిన బదిలీల జాబితా ఐజీ వద్ద పెండింగ్‌లో ఉంది. శాసనసభ ఎన్నికల సమయంలో జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన ఎస్సైలకు స్థానచలనం జరిగింది. అయితే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేసిన ఎస్సైలను బదిలీ చేయాలని ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. దీంతో ట్రాన్స్‌ఫర్లకు సంబంధించిన ఉత్తర్వులు ఎప్పుడైనా రావచ్చనే ప్రచారం పోలీస్‌వర్గాల్లో వ్యక్తమవుతోంది.

మేడారం జాతర నేపథ్యంలో..

ఎస్సైలకు సంబంధించిన బదిలీల జాబితా కసరత్తు చివరి దశకు వచ్చింది. ఐజీ తరుణ్‌జోషి ఈనెల 19 నుంచి 29 వరకు జరిగే మేడారం సమ్మక్క – సారక్క జాతరలో ఉండడంతో ఎస్సైల బదిలీల ఉత్తర్వులు ఆలస్యమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. కమిషనరేట్ పరిధిలో ఎస్సైల బదిలీల్లో ఎవరుంటారో ఎవరు ట్రాన్స్‌ఫర్ అవుతారనేది చర్చనీయాంశంగా మారింది. కొంత మంది ఎస్సైలు తమకు అనుకూలమైన స్థానాలకు బదిలీ చేయించుకునేందుకు కాంగ్రెస్ నేతలను కలిసినట్లు సమాచారం. కాంగ్రెస్ నేతలను కలిసిన వారిలో గతంలో కమిషనరేట్ పరిధిలో చేసిన సమయంలో బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. దీనిపై కొంత మంది కాంగ్రెస్ నేతలు ముఖ్య ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఎస్సైల బదిలీల్లో పొలిటికల్ ప్రభావం ఎంత వరకు ఉంటుందనే చర్చ సాగుతోంది.

పైరవీలకు తావు లేకుండా..

ఎస్సైల బదిలీలకు సంబంధించి పైరవీలకు తావు లేకుండా పోలీసు అధికారులు జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో మాదిరిగా సిఫార్సు లేఖలతో జిల్లాలో పనిచేయడానికి ఎస్సైలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కానీ ట్రాన్స్‌ఫర్లలో పొలిటికల్ ప్రభావం లేకుండా ఉండేందుకు పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

పొలిటికల్ లీడర్లు ఇచ్చిన జాబితాతో పాటు జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు సంబంధించిన జాబితా వెళ్లడంతో జిల్లాలోని ఎస్సైల వాయిదా పడిందనే చర్చ ఆ శాఖలో కొనసాగుతోంది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ఎస్సైల బదిలీలు జరిగినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఎంపీ ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు జిల్లాలో ఎస్సైల బదిలీలు పూర్తవుతాయని తెలుస్తోంది.

ఖిల్లా రామాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో సీతారామచంద్ర స్వామివారి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు ఆలయ ప్రధానార్చకులు సుమిత్ శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో పుణ్యాహవచనం, అంకురార్పణం, ముత్సంగ్రహణం, అఖండ దీపారాధన, రక్షాబంధనం, నివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌గుప్త, ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, డైరెక్టర్లు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూర మాధురి, ఆసది జితేందర్, వీడీసీ సభ్యులు వారాల సాయిలు, తోట చిన్న సాయిలు, తాజా మాజీ సర్పంచ్ గడ్డం రాధ కిష్టారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ గజవాడ జైపాల్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో భాగంగా అంకురార్పణ పూజ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

మార్కెట్ యార్డుకు పసుపు కళ

- సోమవారం ఒక్కరోజే తరలివచ్చిన 30 వేల బస్తాలు



సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి సోమవారం పసుపు పోటెత్తింది. ఒక్కరోజే 30 వేల బస్తాల వరకు పసుపు వచ్చింది. ఈనెల 16, 17, 18 మార్కెట్‌కు వరుస సెలవులు రావడంతో రైతులు పసుపు పంటను భారీగా తరలించారు. ఈ సీజన్‌లో ఒక్కరోజులో ఇంత మొత్తంలో పసుపు రావడం మొదటిసారి. 30 వేల బస్తాలను అధికారులు ఈనామ్ ద్వారా క్రయవిక్రయాలు జరిపారు. అత్యధికంగా రూ. 13,636 ధర పలకగా మోడల్ ధర రూ. 11,500 పలికింది. ధర బాగానే రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లో పసుపు ధర రూ. 17వేలకుపైగానే పలికే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

క్లుప్తంగా

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 3500 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 600 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 250 క్యూసెక్కులు, గుత్ప లిఫ్టుకు 250 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్టు ద్వారా 139 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 490 క్యూసెక్కుల పోతోంది.

బాధ్యతలు చేపట్టిన ఆర్మూర్ ఏసీపీ



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఏసీపీగా బస్వరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం రూరల్‌నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు.

'తైక్వాండో' రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భోజన్న



పెర్కిట్: తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆర్మూర్ పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ భోజన్న ఎన్నికయ్యారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో అసోసియేషన్ ఎన్నికల పరిశీలకుడు అచ్యుతరెడ్డి, ఎన్నికల అధికారి శరత్‌చంద్ర కుమార్ రావు ఈ మేరకు భోజన్నను రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రేపు సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న సీనియర్ మెన్, ఉమెన్ విభాగంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి అంద్యాల లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో ఉదయం 9గంటలకు ఎంపికలు చేపడుతామని పేర్కొన్నారు. ప్రాబబుల్స్‌కు ఎంపికైన క్రీడాకారులకు ఉచిత శిక్షణ, వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. అందులో ప్రతిభ చూపిన వారిని మార్చి 2 నుంచి 4వరకు నల్గొండ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నీకి పంపుతామని తెలిపారు.

ప్రజావాణి వినతులు పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- వాగు సమస్య తీర్చాలని తరలివచ్చిన జాన్కంపేట గ్రామస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్



కలెక్టరేట్ గేటు వద్ద జాన్కంపేట గ్రామస్తులు

సుభాష్‌నగర్: ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 88 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, డీపీవో చక్రవర్తి తరుణ్ కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణి వినతులపై తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా సమాచారం తెలియజేస్తూ, ప్రజావాణి సైట్‌లో పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

వాగు సరిహద్దులు చూపాలి..

వేల్పూర్ మండలం జాన్కంపేట్, పచ్చలనడ్కుడ గ్రామాల వాగు సరిహద్దుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ జాన్కంపేట్ గ్రామస్తులు సోమవారం ప్రజావాణికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కలెక్టరేట్ ప్రధాన గేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. గతంలోనూ ఈ విషయమై సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీకి విన్నవించినా పట్టించుకోలేదని ప్రజావాణి జరిగే సమావేశపు హాల్లోనే అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఎదుట కూర్చొని నినాదాలు చేశారు. అదనపు కలెక్టర్ వారిని సముదాయించి వారం రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ఆర్డీవో ద్వారా సర్వే చేయిస్తానని హామీనిచ్చారు. దీంతో వారు అక్కడి నుంచి వెనుదిరిగారు. ప్రధాన గేట్ ఎదుట గ్రామస్తులు నిరసన తెలపడంతో కార్యాలయంలోకి వెళ్లేందుకు ఇతర ఫిర్యాదుదారులు, కలెక్టరేట్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు గంట కుపైగా గేట్‌కు ఇటు వైపు.. అటు వైపు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఇరు గ్రామాల మధ్య వాగు సరిహద్దు విషయంలో గొడవలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. గత కలెక్టర్ నారాయణరెడ్డి స్థానిక అధికారులను ఆదేశించినా.. వారి నిర్లక్ష్యం వల్లే సమస్య రోజురోజుకూ జటిలమౌతుందని చెప్పారు. ఇంటి అవసరాలకు ఇసుకను తీసుకెళ్తే అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని, అలాగే పశువులకు తాగునీరు, బట్టలు ఉతికేందుకు సైతం పచ్చలనడ్కుడ గ్రామస్తులు అనుమతించడం లేదని ఆరోపించారు. గ్రామస్తులు రమేష్, చందన్, కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో బైఠాయించిన జాన్కంపేట వాసులు

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

డొంకేశ్వర్: డొంకేశ్వర్‌లో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని సర్వసమాజ్ కమిటీ సభ్యులు సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. పంచాయతీ స్థలాన్ని ఆక్రమించిన కొందరు అక్కడ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా ఫెన్సింగ్ వేసి బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. బార్ల గంగా రెడ్డి, కందునూరి రామాగౌడ్, తదితరులున్నారు.

వృక్షశాస్త్ర విభాగంలో భార్గవికి పీహెచ్‌డీ



భార్గవిని అభినందిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని రాసకట్ల భార్గవి డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ ఎం అరుణ పర్యవేక్షణలో 'స్టడీస్ ఆన్ ఏ లేక్ ఆఫ్ నిజామాబాద్ డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ- విత్ రిఫరెన్స్ టు సీజనల్ వేరియేషన్ ఆఫ్ ఫైటో ప్లాంక్ టాన్ కమ్యూనిటీ' అనే అంశం పై భార్గవి పరిశోధక గ్రంథాన్ని సమర్పించారు. సోమవారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఓపెన్ వైవావోస్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ శైలజ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. డాక్టరేట్ సాధించిన భార్గవిని రిజిస్ట్రార్ యాదగిరి అభినందించారు. తెయూ బోటనీ విభాగాధిపతి ఎం అరుణ, బీవోఎస్ చైర్మన్ విద్యావర్ధిని, అధ్యాపకులు హలీమ్‌ఖాన్, డి శ్రీనివాస్, వి జలందర్ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి కానిస్టేబుళ్లకు శిక్షణ

ఖలీల్‌వాడి: కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 21 నుంచి శిక్షణ ఇచ్చేందుకు పోలీస్ నియామక మండలి చర్యలు చేపట్టింది. జిల్లాలో సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లుగా 400 మంది ఎంపికయ్యారు. వారి వివరాలను జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సేకరిస్తున్నారు. ఏ జిల్లాలో శిక్షణ అందించనున్నారో వారికి తెలుపుతారు. కానిస్టేబుళ్లు మంగళవారం ఆయా జిల్లాలకు చేరుకుంటారు. అక్కడి చేరుకున్న తర్వాత పోలీస్ శిక్షణ కేంద్రంలో బుధవారం నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిసింది.

బెటాలియన్ కానిస్టేబుళ్లకు పొరుగు రాష్ట్రాల్లో..

రాష్ట్రంలో సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లకు శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. దీంతో వారికి ఇక్కడే ట్రెయినింగ్ ఇవ్వనున్నారు. బెటాలియన్ విభాగంలో ఎంపికైన వారికి శిక్షణ కేంద్రాలు లేకపోవడంతో పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌కు పంపించడానికి ప్రభుత్వం సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీ, కర్నాటక ప్రభుత్వం లేదా పోలీస్‌శాఖ నుంచి సమాచారం వస్తే వెంటనే శిక్షణ ఇచ్చేందుకు పోలీస్‌శాఖ చర్యలు తీసుకోనుంది. లేకపోతే శిక్షణ ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

ఎంపీ టికెట్ కోసం నడ్డాకు వినతి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బీజేపీ నిజామాబాద్ లోక్‌సభ టికెట్ కోసం నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారి, మంచాల శంకరయ్య గుప్తా ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ గుప్తా సోమవారం ఢిల్లీలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిసి వినతిపత్రం అందించారు. జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కె రాములుతో కలిసి బీజేపీ కేంద్ర కార్యాలయంలో నడ్డాకు తన దరఖాస్తును సమర్పించారు.

డైరీ ఆవిష్కరణ



సుభాష్‌నగర్: రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ రూపొందించిన డైరీని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, జిల్లా ఎన్నికల నోడల్ అధికారి సురేష్ కుమార్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, వినోద్ కుమార్, భుజంగరావు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేక కుట్రలు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంపీ అర్వింద్‌కు, బీజేపీకి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేక ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆరోపించారు. సోమవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అర్వింద్‌పై కరపత్రాల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని, దీని వెనక ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సోదరుడు దేవేందర్‌రెడ్డి హస్తముందన్నారు. జీవన్ రెడ్డి ఏనాడైనా పసుపు రైతుల గురించి ఆలోచించారా అని ప్రశ్నించారు. పసుపు బోర్డు సాధించి ఎంపీ అర్వింద్ వారికి అండగా నిలిచారని గుర్తుచేశారు. జీవన్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోందని చెప్పారు. పోటీ చేయాలనుకుంటే బరిలో నిలవాలని, కానీ చిల్లర మల్లర వ్యవహారాలు చేయడం సరికాదన్నారు. బీజేపీలో సస్పెండ్ అయిన వారితో, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేసేవారితో దిష్టిబొమ్మలు దహనం చేయించడమేంటని ప్రశ్నించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ బలోపేతం కోసం ఎంపీ అర్వింద్ తీవ్రంగా శ్రమించారన్నారు. అర్వింద్ గెలుపును ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు. సమావేశంలో పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, నారాయణ యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్, కిషన్ నాయక్, మాస్టర్ శంకర్, ఇప్పకాయల కిశోర్, సందీప్, నాయిడి రాజన్న, అంబదాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



ఖలీల్‌వాడి: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఖలీల్‌వాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. జిల్లా జడ్జి, న్యాయ సేవా సంస్థ అధ్యక్షులు న్యాయమూర్తి పద్మావతి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మైనర్లు వాహనాలు నడుపొద్దని సూచించారు. అనంతరం న్యాయ సేవా సంస్థ అధ్యక్షులు పద్మావతి చట్టాలపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం వాసుదేవరావు తమ పాఠశాలలో వసతులు కల్పించడానికి సహాయ సహకారాలు అందించాలని జిల్లా జడ్జికి మెమోరండం అందించారు. జెండాగల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రామచందర్ గైక్వాడ్, రిటైర్డ్ హెచ్‌ఎం నర్ర రామారావు, దుబ్బ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జొన్న వ్యాపారులతో రైతుల చర్చలు

- తెల్లజొన్న క్వింటాలుకు రూ.3,650.. ఎర్రజొన్నలకు రూ.3,870కు ఒప్పందం



వ్యాపారులతో మాట్లాడుతున్న జొన్న రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): కష్టపడి పంటలు పండించిన రైతులు పంటను అమ్ముకోవడానికి వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. జొన్న వ్యాపారులు రోజుకో ధర చెప్పడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. పంటను అమ్మాలో వద్దో తెలియక తికమక పడుతున్నారు. డొంకేశ్వర్ మండలంలో రైతులు అధిక మొత్తంలో ఎర్ర, తెల్లజొన్న పంటలను సాగు చేశారు. ప్రస్తుతం ధరకోసం వ్యాపారులను బతిమిలాడాల్సిన పరిస్థితి నెలకొంది. సోమవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో జొన్న వ్యాపారులతో రైతులు ధర విషయంలో చర్చలు జరిపారు. తెల్లజొన్న క్వింటాలుకు రూ. 3,650, ఎర్రజొన్న రూ. 3,870కి కొనుగోలు చేయడానికి వ్యాపారులు ఒప్పందం చేసుకున్నారు. వ్యాపారులు ధర తగ్గించడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తెయూ ఆర్ట్స్ డీన్‌గా లావణ్య



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఫాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్‌గా ప్రొఫెసర్ కరిమిండ్ల లావణ్య నియామకమయ్యారు. తెయూ ఇన్‌చార్జి వీసీ బుర్ర వెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి సోమవారం లావణ్యకు నియామక ఉత్తర్వులు అందజేశారు. తెలుగు అధ్యయన శాఖ ప్రొఫెసర్ లావణ్య గతంలో బాలికల వసతి గృహ వార్డెన్‌గా, పరీక్షల అదనపు కంట్రోలర్‌గా, ఉమెన్ సెల్ డైరెక్టర్‌గా, పబ్లికేషన్ సెల్ కో-ఆర్డినేటర్‌గా, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా, తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షులుగా, బీవోఎస్ చైర్మన్‌గా పనిచేశారు.

పేకాట స్థావరంపై దాడి

రుద్రూర్: కోటగిరిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వారి నుంచి రూ.12,300 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాల సీజ్

కామారెడ్డి క్రైం: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని దేవునిపల్లి ఎస్సై రాజు హెచ్చరించారు. దేవునిపల్లి హైస్కూల్ వద్ద సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీలను చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. నంబర్ ప్లేట్ లేని ఏడు వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పదంగా యువకుడి మృతి



బీబీపేట: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన జనగామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్, స్థానికులు తెలిపిన వివరాలు.. కోనాపూర్ గ్రామానికి చెందిన దుంపల రాజు (32) కూలీ పనులు చేసుకుంటూ ఉండేవాడు. మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన రాజు జనగామ శివారులో మృతి చెంది ఉండటాన్ని ఆదివారం సాయంత్రం పోలీసులు గుర్తించారు. మృతుడి మెడకు చిన్నతాడు ఉండి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. రాజు ఆత్మహత్య చేసుకున్నాడా మరేదైనా కారణమా అనేది విచారణ తర్వాత తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరు..

సదాశివనగర్: మండలంలోని కుప్రియాల్ శివారులో 44వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఓ ద్విచక్ర వాహనం అదుపు తప్పి డీవైడర్‌కు ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. గాంధారి మండలం చిన్న పోతంగల్ గ్రామానికి చెందిన పుప్పాల సంతోష్(27) కామారెడ్డి నుంచి పోతంగల్‌కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా కుప్రియాల్ శివారులో డివైడర్‌ను ఢీకొన్నాడు. తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

రుద్రూర్: కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన కానూరి రాజశేఖర్ (35) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వర్నిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో విధులు నిర్వహించే రాజశేఖర్ గత నెల 31న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ నెల 16న నిజాంసాగర్ కాలువ పక్కన కాలిన గాయాలతో ఉన్న ఆయనను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి రాఘవేంద్రరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధర్మారం(బి) గ్రామానికి చెందిన మరొకరు..

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన షేక్ మాజిద్ (36) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. వివరాలు.. పిల్లలు కావడం లేదని ఈ నెల 15న మాజిద్ భార్యతో గొడవపడ్డాడు. అనంతరం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి అన్న జావేద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళ..

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మహిళ మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం లింగాయపల్లిలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలు.. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామానికి చెందిన కొంపల్లి సాయవ్వ (50) తన బంధువుల ఇంట్లో గృహ ప్రవేశం ఉందని సోమవారం లింగాయిపల్లికి వెళ్లింది. ఇంటి తలుపు దగ్గర ఉన్న ఓ విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురైంది. వెంటనే ఆమెను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికి చనిపోయింది. మృతురాలి భర్త గతంలోనే చనిపోగా ఇద్దరు కుమారులు ఉన్నారు. దేవునిపల్లి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఆటో, బైక్ ఢీ

- ఒకరి పరిస్థితి విషమం
- మరో నలుగురికి గాయాలు



గాయపడిన ఆటోలోని ప్రయాణికులు



గాయపడ్డ ప్రదీప్

మోపాల్: నగర శివారులోని బోర్గాం(పి) వద్ద సోమవారం మధ్యాహ్నం ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. ఎస్సై గంగాధర్ కథనం ప్రకారం.. బోర్గాం(పి) గ్రామానికి చెందిన దాయని ప్రదీప్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం మోపాల్ నుంచి బోర్గాం వైపు వస్తుండగా, అదే సమయంలో నిజామాబాద్ నుంచి మోపాల్ వైపు చిన్నాపూర్‌కు చెందిన జైపాల్ ఆటో వెళ్తుంది. బైక్ అదుపు తప్పి ఆటోను వేగంగా ఢీకొట్టడంతో ప్రదీప్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న మరో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రదీప్ పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించినట్లు తెలిసింది. ఆటో డ్రైవర్ జైపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళను కట్టేసి నగదు, బంగారం అపహరణ

- బాన్సువాడలో పట్టపగలు ఘటన

బాన్సువాడ: ఇంట్లోకి చొరబడి మహిళను కట్టేసి బంగారం, నగదు ఎత్తుకెళ్లిన ఘటన బాన్సువాడలో చోటు చేసుకుంది. బాన్సువాడ టౌన్ సీఐ కృష్ణ కథనం ప్రకారం.. పట్టణంలోని ఫిర్దోస్ కాలనీలో నివాసముంటున్న గౌసియా బేగం ఇంట్లోకి సోమవారం మధ్యాహ్నం ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులు ధరించి చొరబడ్డారు. వారు గౌసియా బేగంను కట్టేసి, అరవకుండా నోట్లో బట్ట పెట్టారు. అనంతరం బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.50 వేల నగదుతో పాటు అర తులం బంగారం ఎత్తుకెళ్లారు. ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు తనను చున్నీతో ఫ్యానుకు వేలాడదీశారని బాధితురాలు తెలిపినట్లు సీఐ చెప్పారు. దొంగలు పారిపోగానే నోట్లో ఉన్న బట్ట పడిపోవడంతో కేకలు వేయగా పక్కింటి ఇర్ఫానా బేగం వచ్చి తన మెడకు ఉన్న చున్నీని విప్పినట్లు బాధితురాలు చెప్పిందన్నారు. గౌసియా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

పత్తిపంటను మేసిన గొర్రెలు మృతి

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం జీజీనడ్కుడలో పత్తి పంటను మేసి గొర్రెలు మృతి చెందాయి. బింగి గంగాధర్‌కు చెందిన గొర్రెలను వారం క్రితం మేతకోసం మహారాష్ట్రకు తీసుకెళ్లారు. మేత మేసిన గొర్రెల మంద తిరిగి ఇంటికి రాగానే ఒక్కొక్కటిగా మృతి చెందడం మొదలైంది. వరుసగా ఐదు గొర్రెలు చనిపోవడంతో పశుసంవర్ధక శాఖ అధికారి హన్మంత్ రెడ్డికి సమాచారం ఇచ్చాడు. సోమవారం జీజీ నడ్కుడకు వచ్చిన ఆయన చనిపోయిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. పత్తి పంటను మేయడంతో అది విషంగా మారి గొర్రెలు చనిపోతున్నాయని వెల్లడించారు. మేతకోసం మహారాష్ట్రకు ఎన్ని గొర్రెలు వెళ్లాయో ఆరా తీశారు. మొత్తం నాలుగువేల వరకు మేతకు వెళ్లగా, ఆహారం విషంగా మారకుండా మందులు రాసిచ్చినట్లు హన్మంత్ రెడ్డి తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

మాక్లూర్: మద్యానికి బానిసై చెరువులో పడి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు సోమవారం తెలిపారు. వివరాలు.. నిజామాబాద్ నగరం 3వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే సుధాకర్ (27) జులాయిగా తిరిగేవాడు. తరుచూ మద్యానికి డబ్బు అడుగుతుండటంతో ఈ నెల 10న తల్లిదండ్రులు మందలించారు. అదే రోజు ఇంటి నుంచి వెళ్లిన సుధాకర్ తిరిగి ఇంటికి రాకపోవటంతో తల్లిదండ్రులు ఠాణాలో ఫిర్యాదు చేశారు. సోమవారం మాక్లూర్ మండలం బోర్గాం (కె) చెరువులో మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి ప్రతాప్ ఫిర్యాదు మేరకు కేసు చేశామని ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: రుద్రూర్ మండలం సులేమాన్ ఫారం వద్ద సోమవారం రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్టు ఎస్సై మహేందర్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌లను పోలీస్‌స్టేషన్ తరలించి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు సమాచారం అందించామని చెప్పారు.

డ్రంకన్ డ్రైవ్‌లో రెండు రోజుల జైలు

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. రెండు రోజుల క్రితం పట్టణ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టణానికి చెందిన గోపాల్ అనే వ్యక్తి డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అతడిని సోమవారం కోర్టుకు హాజరుపర్చగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

కుక్కలను చంపిన వారిపై ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండలం మచ్చర్లలో వీధికుక్కలను చంపిన వారిపై ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మేడ్చల్ జిల్లాకు చెందిన బ్రీత్ యానిమల్ రెస్క్యూ హోం వ్యవస్థాపకురాలు సరజ సాయిశ్రీ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో 33 కుక్కలను విష ప్రయోగం చేసి చంపారని సరజ సాయిశ్రీ ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా మండల పశు సంవర్ధక శాఖ అధికారి లక్కం ప్రభాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది మృతి చెందిన కుక్కలకు పోస్టుమార్టం నిర్వహించి పోలీసులకు నివేదిక అందజేశారు.

కుమారుడితో సహా తల్లి అదృశ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాత రాజంపేటకు చెందిన తల్లీ కొడుకులు అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన దేవకి మాలిక్, ఆమె రెండేళ్ల కుమారుడు జితేంద్ర మాలిక్ సోమవారం ఉదయం నుంచి కనిపించడం లేదని భర్త చంద్ర మాలిక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.